క్లుప్తంగా

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

లక్ష్మీపురం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినాన్ని పాత గుంటూరు శ్రామిక నగర్‌లో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ సంఘం స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మానికొండ సూర్యావతి, కొమర్రాజు అచ్చమాంబ, మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, భిక్షావతి లాంటి నాయకులు హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా కోటి సభ్యత్వంతో రాష్ట్రంలో 2.30 లక్షల సభ్యత్వం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ, ఎం.కృష్ణకుమారి, వి.ఆదిలక్ష్మి, కుమారి, శివమ్మ, అంకమ్మ, బుజ్జి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలి

లక్ష్మీపురం: పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలంలో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు అర్హులైన పేదలకు ఇవ్వాలని వ్యక్తిగత అర్జీలు పేదలతో పూర్తి చేయించినట్లు సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి అన్నారు. బొంగరాలబీడు ప్రాంతంలోని 55వ డివిజన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఇళ్ల స్థలాలకు సంబంధించి అర్జీలు పూర్తి చేసే కార్యక్రమం చేపట్టారు. నగరంలోని అన్ని డివిజన్‌లలో దరఖాస్తులు పూర్తి చేసి ఈనెల 18 నుంచి అన్ని వార్డు సచివాలయాల్లో అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, డి.వెంకటరత్నం, మస్తాన్, లెవీ, లక్ష్మీకమలమ్మ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



లక్ష్మీపురం: పట్టాభిపురం జూట్ మిల్లు సమీపంలోని మసీదు వద్ద గుర్తు తెలియని ఓ వృద్ధుడు(65) మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాలు.. మసీదు వద్ద ఉదయం వచ్చి కూర్చున్న వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ రాంబాబు పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. వివరాలకు 8688831344లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: గుంటూరు డీ 12 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రాజమోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్‌లో విద్యుత్ లైనుల మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్త లాలపురం, లాలుపురం, వై.జంక్షన్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సెలవు రోజుల్లోనూ జీఎంసీ క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలను చెల్లించేందుకు నెలాఖరు వరకే మాత్రమే గడువు ఉన్నందున పన్ను చెల్లింపుదార్లకు వీలుగా ఆదివారం సెలవు రోజూ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులు చెల్లింపునకు నెలాఖరు వరకే గడువు ఉన్నందున ఈ నెల 16న సెలవు రోజైనా ఆదివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్లలో క్యాష్ కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



గుంటూరు ఎడ్యుకేషన్: వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్ పో విద్యార్థినుల్లోని ప్రతిభకు అద్దం పట్టింది. తెలుగు, హిందీ, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టుల వారీగా విద్యార్థినులు తయారు చేసిన వంద నమూనా ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా శివారెడ్డిపాలెం బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ మాట్లాడుతూ ప్రదర్శనలో విద్యార్థినులు రూపొందించిన నమూనా ప్రాజెక్టులు భావి శాస్త్రవేత్తలను రూపకల్పనకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వీర్ల త్రివేణి, ఉపాధ్యాయులు పి.రాజకుమారి, వెంకటేశ్వర్లు, కె.వేణుగోపాల్, ఎం.రాములు, మధు శ్రీ, కె.సాహితి, ఎం.కుమారి, జీఎల్ గణేష్, మధుర స్వాతి, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెరిబ్రల్ పాల్సీని నయం చేయవచ్చు..

- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సమస్యను నివారించవచ్చు
- ప్రతి రోజూ జీజీహెచ్‌కు బాధిత చిన్నారులు
- ఉచితంగా ఆపరేషన్లకు అవకాశం

గుంటూరు మెడికల్: బిడ్డ పుట్టగానే ఏడుపు విని తల్లి పరవశించి పోతోంది. ఆ ఏడుపు కోసం వెయ్యికళ్లలో ఎదురుచూస్తుంటారు బంధువులు. కానీ ఆ ఏడుపు ఆలస్యమైతే.. అది సెరిబ్రల్ పాల్సీ కావొచ్చు. పుట్టే వెయ్యిమంది పిల్లల్లో ఇరువురు లేదా ముగ్గురు వ్యాధి బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్ జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డైక్)లో బాధిత పిల్లలకు వైద్యసేవలు అందించి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నారు.

వ్యాధి ఎలా వస్తుంది...

పుట్టే బిడ్డ గర్భంలో ఉండగానే మెదడులో కణాలు దెబ్బతినటం వల్ల వస్తుంది. రూబెల్లా లాంటి ఇన్‌ఫెక్షన్లు సోకినప్పుడు సోకుతుంది. అధికరక్తపోటు, పోషకాహారలోపం, తల్లిదండ్రుల రక్తం గ్రూపులు సరిపడక బిడ్డ మెదడు దెబ్బతినడం. కాన్పు కష్టంగా ఉన్నప్పుడు, బిడ్డను బయటకు లాగే సమయంలో మెదడుకు ఇబ్బంది కలిగినప్పుడు, బొడ్డు పేగును బ్లేడుతో కోసినప్పుడు ఇన్‌ఫెక్షన్లు సోకి, పుట్టగానే కామెర్లు సోకితే, మేనరికపు వివాహాల వలన, బిడ్డ పుట్టగానే రెండు మూడు నిమిషాల పాటు మెదడుకు ఆక్సిజన్ అందక బిడ్డ ఏడ్వకపోతే ఈ వ్యాధి సోకుతుంది. ఇది అంటువ్యాధి కాదు. వైరస్, బ్యాక్టీరియాల వల్ల రాదు.

> మన దేశంలో సుమారు 40 లక్షల మంది వ్యాధి బాధిత చిన్నారులు ఉన్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 20 వేల మంది పిల్లలు వ్యాధితో బాధపడుతున్నారు. సెరిబ్రల్ పాల్సీ వ్యాధిపై అవగాహన లేకపోవటం వల్లే పిల్లలకు సరైన వైద్యం అందించటం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజు రెండు కేసులు నమోదు అవుతున్నాయి.

జీజీహెచ్‌లో చికిత్స ఇలా..

లక్షణాలు...

పుట్టగానే బిడ్డ ఏడవకుండా ఉంటాడు. మెడ నిలబెట్టలేరు. పాకటం, బోర్లాపడటం, కూర్చోవటం, నిలబడటం, నడవటం ఆలస్యం అవుతాయి. నోటి వెంట చొంగ కారుతుంది. మెల్లకన్ను. సోషల్ స్మయిల్ నిరంతరం ఉంటుంది. రెండు కాళ్లు వెనక్కి పెట్టుకుని కూర్చుంటారు. బిడ్డ పుట్టిన మూడు నెలల్లోగా బిడ్డ కదలికల్లో తేడాలను తల్లిదండ్రులు గుర్తించాలి. పాలు తాగకపోవటం, మాటలు కష్టంగా ఉండటం, కాళ్లు, చేతులు వంకర్లు పోవటం, చేతులు, వేళ్లు స్వాధీనంలో లేకపోవటం, కాళ్లు కత్తెరలా వంకరపోవటం, కాళ్ల కండరాలు అతిగా స్పందిస్తూ బలంగా బిగుసుకుపోతాయి. ఉక్కు పిల్లల మాదిరిగా చాలా స్టిఫ్‌గా ఉంటారు. బిడ్డలో వయస్సుకు తగిన పెరుగుదల కనిపించదు.



ఫిజియోథెరపి చేస్తున్న డాక్టర్ టీనా

అందుబాటులో చికిత్స



సెరిబ్రల్ పాల్సీ బాధితులకు ఫిజియోథెరపి, ఆపరేషన్లు, ఇంజెక్షన్లు, మందులు వ్యాధి నియంత్రణ కోసం అందుబాటులో ఉన్నాయి. వ్యాధి వలన వచ్చే అంగవైకల్యానికి ఉచితంగా ఆపరేషన్లు చేసి నయం చేస్తాం. ఆపరేషన్ అనంతరం సాధారణ పిల్లల మాదిరిగానే జీవితాన్ని గడపవచ్చు. సెరిబ్రల్ పాల్సీపై అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ యశస్వి రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్

డైక్ సెంటర్‌లో ఉచిత వైద్యం



జీజీహెచ్ డైక్ సెంటర్‌లో ప్రతిరోజూ ఐదుగురు సెరిబ్రల్ పాల్సీ చిన్నారులకు ఫిజియోథెరపి అందిస్తున్నాం. ప్రతిరోజూ రెండు కొత్త కేసులు చికిత్స కోసం వస్తున్నాయి. బిడ్డకు ఏడాది నుంచి మూడేళ్లలోపు ఫిజియోథెరపి క్రమం తప్పకుండా చేయించడం ద్వారా ఆపరేషన్‌తో పనిలేకుండానే సాధారణ జీవితాన్ని గడిపేలా చేయవచ్చు. కొన్ని కేసులకు తప్పనిసరిగా ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది.

– కొత్త టీనా, ఫిజియోథెరపిస్ట్

తొలిసారిగా నగరంలో గ్రీన్ వెండింగ్ జోన్

కమిషనర్ పులి శ్రీనివాసులు



వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కమిషనర్, పక్కన ఎమ్మెల్యే మాధవి

నెహ్రూనగర్: రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు నగరంలో వీధి వ్యాపారుల సౌలభ్యం, సంక్షేమం కోసం గ్రీన్ వెండింగ్ జోన్ ఏర్పాటు చేశామని, వీధి వ్యాపారులపై దోపిడీకి అడ్డుకట్ట వేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్ కళాశాల దగ్గర వీధి వ్యాపారుల వెడింగ్ జోన్ ప్రారంభించి, గుర్తింపు కార్డులు అందించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వీధి వ్యాపారులు రోడ్లు, డ్రెయిన్ల మీద వ్యాపారాలు చేసుకోవడం వలన ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని చెప్పారు. అదే విధంగా వీధి వ్యాపారులను కొందరు అద్దెల పేరుతో దోపిడీ చేయడం గుర్తించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా వీధి వ్యాపారుల సంక్షేమం కోసం గ్రీన్ వెండింగ్ జోన్ ఏర్పాటు చేశామన్నారు. తొలి విడతగా పాలిటెక్నిక్ కాలేజి వద్ద 56 మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందించామని, దశలవారీగా నగరంలో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధి వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా, ప్రజలకు అందుబాటులో ఉండేలా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రెండు వేల మంది వీధి వ్యాపారుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన వారిని గుర్తించడానికి జీఎంసీ చర్యలు తీసుకుంటుందన్నారు. వెండింగ్ జోన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు మానం పద్మశ్రీ, ఈ.వరప్రసాద్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

‘వేరియంట్’ కంపెనీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం రమేష్

నగరంపాలెం: బ్రాడీపేట 6వ వీధిలో(అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ దగ్గర) వేరియంట్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కంపెనీ కార్పొరేట్ కార్యాలయాన్ని శనివారం ఎంపీలు సీఎం రమేష్, లావు కృష్ణదేవరాయలు శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఈ కంపెనీ అమరావతిని కేంద్రంగా పలు ప్రాంతాల్లోని ప్రజల జీవనశైలిని ప్రభావితం చేసేలా అభివృద్ధిలో భాగమయ్యేందుకు కృషి చేయాలన్నారు. జన్మభూమి స్ఫూర్తి, ఏపీ ప్రభుత్వంపై నమ్మకం తో కంపెనీ ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 50,000 మందికి పైగా ఆర్థిక భరోసా కల్పిస్తామని ప్రకటించారు. ప్రకాశం జిల్లాలోని మద్దిపాడు, ముండ్లమూరుల్లో గేటెడ్ కమ్యూనిటీ, శాటిలైట్ టౌన్‌షిప్ మోడల్‌ను ప్రారంభించామని వివరించారు. త్వరలో నంబూరు, తాడేపల్లి, పోరంకి, లాం, గన్నవరంలో ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్‌లను, బాపట్ల బీచ్ వద్ద, కృష్ణానది ఒడ్డున అల్ట్రా మోడరన్ రిసార్ట్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గళ్లా మాధవి(పశ్చిమ), నజీర్‌అహ్మద్ (తూర్పు), ధూళిపాళ్ళ నరేంద్ర(పొన్నూరు), నక్క ఆనందబాబు(వేమూరు), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కరణం బాల రామకృష్ణమూర్తి, బాచిన చెంచు గారటయ్య, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, టీడీపీ నాయకులు దేవినేని ఉమా, మన్నెం నాగమల్లేశ్వరరావు, కంపెనీ చైర్మన్ శృంగవరపు నిరంజన్, ఎండీ ఆడుసుమల్లి కిషోర్‌బాబు, డైరెక్టర్‌లు కోయ హరీష్‌జై, తళ్లూరి నాగార్జున, కొండా ఫణిరామ్, మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న చంద్రముని

గుంటూరు ఎడ్యుకేషన్: ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులను ప్రోత్సహించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని యువజన సర్వీసులశాఖ, స్టెప్ స్వశక్తి సీఈఓ ఆర్.చంద్రముని పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శనివారం జెడ్పీ ప్రాంగణంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో ప్లాస్టిక్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించండి, పునర్వినియోగపరచదగిన వాటిని ప్రోత్సహించండి అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రముని మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను పదే, పదే వాడం వలన కేన్సర్ వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్టెప్, స్వశక్తి సూపరింటెండెంట్ తన్నీరు శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



ప్రముఖులకు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి వార్షికోత్సవం నిర్వహించారు. ఎం.అంజనా సుధాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి గౌరవాధ్యక్షులు, వందేళ్లు పూర్తి అయిన పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి, మృదంగ విద్వాంసులు పద్మశ్రీ పండిట్ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, సంగీత కళా సామ్రాట్, చిత్రవీణ విద్వాంసులు డాక్టర్ ఎస్.రవికిరణ్‌లను సత్కరించారు. అనంతరం డాక్టర్ ఎన్.రవికిరణ్(చెన్నై) చిత్ర వీణ శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. ప్రముఖ కళాకారులు కళారత్న మోదుమూడి సుధాకర్‌ను కూడా సత్కరించారు. కార్యక్రమంలో మాదల రత్నగిరిబాబు, సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితా దేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, సహాయ కార్యదర్శి మాధవీకృష్ణ, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

రెక్టార్ రత్నషీలామణి



సర్టిఫికెట్లు అందజేస్తున్న రెక్టార్ రత్నషీలామణి

ఏఎన్‌యూ: దేశ స్వాతంత్ర్యానంతరం భారత జాతి నిర్మాణంలో బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివని ఏఎన్‌యూ రెక్టార్ కె.రత్నషీలామణి అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ‘రోల్ ఆఫ్ బాబూ జగ్జీవన్‌రామ్ ఇన్ నేషన్ బిల్డింగ్’ అనే అంశంపై రెండు రోజులపాటు జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రెక్టార్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ వంటి మహనీయులు కొన్ని వర్గాలకే పరిమితం కాదని వారు అందరివారన్నారు. జగ్జీవన్ రామ్ కేంద్ర మంత్రిగా ప్రవేశ పెట్టిన సంస్కరణలు దేశాభివృద్ధిలో నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. సిద్ధాంతాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన సదస్సులో దేశ వ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, 12కిపైగా యూనివర్సిటీల నుంచి పరిశోధకులు, ప్రతినిధులు హాజరయ్యారన్నారు. దేశ వ్యాప్తంగా 128 మంది పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ పరిశోధనా పత్రాలతో త్వరలో పరిశోధనా పత్రాల సంపుటిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పూలే అధ్యయనకేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు ప్రసంగిస్తూ రెండు రోజులపాటు నిర్వహించిన సదస్సులో పలు కీలక అంశాలపై చర్చ జరగడం అభినందనీయమన్నారు. సామాజిక చైతన్యం, దేశాభివృద్ధి, రాజకీయ రంగం వంటి కీలక అంశాలపై క్షేత్రస్థాయిలో చర్చ జరిగిందన్నారు. నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాకాణి సుధాకర్, ఆంధ్రా యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ఆదూరి శామ్యూల్ జాన్, ఏఎన్‌యూ అధ్యాపకులు జి.చెన్నారెడ్డి, వి.తులసీదాస్ ప్రసంగించారు. సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

జీజీహెచ్‌లో ప్యాప్-డీ ప్రారంభం



మందుల వాడకంపై అవగాహన కల్పించే కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు వైద్యులు సిఫార్సు చేసిన మందులు ఏవిధంగా వాడాలనే విషయాలను తెలియజేసేందుకు నూతనంగా ప్యాప్-డీ కార్యక్రమాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. కార్పొరేటర్ పోతురాజు సమత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణ మాట్లాడుతూ వైద్యులు రాసే మందులు ఏవిధంగా వాడాలో తెలియక, పలువురు రోగులు అవస్థలు పడుతుంటారని, వాటిని తొలగించేందుకు నూతనంగా ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రూము నంబరు –6లో ప్రత్యేక గది ఏర్పాటు చేశామన్నారు. రోగులు, వారి సహాయకులు మందులపై ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చు అన్నారు. వైద్య కళాశాల ఫార్మకాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళి



నెహ్రూనగర్: బహుజన సమాజ్ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం జయంతి సందర్భంగా స్థానిక గుంటూరు ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహాన్ని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆలూరి ఆనంద్ పాల్గొని నివాళులర్పించారు.

రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలి

నెహ్రూనగర్: నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా రోడ్ల విస్తరణ పనులు నిర్వహించేందుకు స్థానిక ప్రజలు సహాయ సహకారాలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో వసంతరాయపురం ప్రధాన రహదారి విస్తరణ, నెహ్రూనగర్ ప్రధాన రహదారి విస్తరణకు సంబంధించి గృహాలు, స్థలాలు కోల్పోతున్న స్థానిక ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ, ఇన్నర్ రింగ్ రోడ్డు ఆర్వోబీ, శ్యామల నగర్ ఆర్వోబీ, పేరేచర్ల ఓవర్ బ్రిడ్జి, నందివెలుగు రోడ్డులో అసంపూర్తిగా నిర్మించిన ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి, నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. వసంతరాయపురం ప్రధాన రహదారిని డొంక రోడ్డు నుంచి శారద కాలనీ ఆర్చి సెంటర్ వరకు, నెహ్రూనగర్ ప్రధాన రహదారిని నెహ్రూ నగర్ రైల్వే గేటు నుంచి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డుగా విస్తరించాల్సి ఉందని చెప్పారు. సదరు ప్రాంతాలలో గృహాలు, స్థలాలు కోల్పోతున్న ప్రజలకు నిబంధనల ప్రకారం ప్రభావిత భవనాలు కోల్పోతే నగదు రూపంలో నష్టపరిహారం, స్థలం కోల్పోతున్న వారికి టీడీఆర్ బాండ్‌లను అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, ఏసీపీ మల్లిఖార్జున రావు, టీపీఎస్ లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



నగరంపాలెం: అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం కల్యాణమూర్తులకు పలు రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకార్చన చేశారు. తొలుత గోపూజ, గణపతి పూజతో ప్రారంభించారు. దంపతులతో పుణ్యాహవచనం, మండపారాధన, మహాసంకల్పంతో మంత్రార్థలను వివరిస్తూ కల్యాణం నిర్వహించారు. హారతి, మంత్ర పుష్పం అనంతరం కల్యాణానికి హాజరైన దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ చేశారు. ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ, ధర్మకర్త మర్రిపాటి పార్థసారథి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎన్టీఆర్ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని తొలిగించారని ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న స్థానికులు, పార్టీ నాయకులు



పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన కార్యకర్త

లక్ష్మీపురం: టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీ రామారావు చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలిగించి, స్థానిక నాయకుల చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ ఆ పార్టీ వీరాభిమాని శనివారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరం రత్నగిరినగర్ ప్రాంతానికి చెందిన ఎన్టీఆర్ వీరాభిమాని మునగా సాంబశివరావు, అలియాస్ సాంబయ్య,(డ్రైవర్ రాముడు), అనే వ్యక్తి ఇటీవల గుజ్జనగుండ్ల వాటర్ ట్యాంక్‌ల వద్ద దివంగత ఎన్టీఆర్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే అదే ప్రదేశంలో టీడీపీ కార్పొరేటర్ కోవెలముడి నాని, స్థానిక మైనారిటీ నాయకుడు బాబు చిత్రాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సాంబయ్య ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను తొలిగించారు. దీంతో ఆవేదన చెందిన సాంబయ్య ఎన్టీఆర్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను తొలిగించినందుకు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన స్థానికులు సాంబయ్యను ఆత్మహత్యకు పాల్పడకుండా అడ్డుకున్నారు. ఇంతా జరుగుతున్నా పట్టాభిపురం పోలీసులు మాత్రం కన్నెత్తి ఇటువైపు చూడలేదు.

శ్రీలక్ష్మీ తిరుపతమ్మ- గోపయ్య స్వాముల గ్రామోత్సవం



శ్రీలక్ష్మీ తిరుపతమ్మ- గోపయ్య స్వాముల ఊరేగింపు

నగరంపాలెం: స్థానిక కొరిటిపాడు (ఆంజనేయపేట) వాకింగ్ ట్రాక్ ఎదురు వేంచేసిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ- గోపయ్య స్వాముల వారి తిరునాళ్ల శనివారం రెండో రోజుకి చేరింది. విఘ్నేశ్వర పూజ, గణపతి హోమం, నవగ్రహ మంత్ర హవనం, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ- గోపయ్య స్వాముల వారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చనలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, దేవతామూర్తుల వేషదారులతో కొరిటిపాడు వీధుల్లో ఊరేగింపు కొనసాగింది. కన్నసాని విజయ్‌కుమార్(రాజా) రవికుమార్, బాజీ, కిలారు ఆదినారాయణ, బుల్లెయ్య, బసవయ్య పర్యవేక్షించారు.

జీజీహెచ్‌లో పరిశుభ్రతపై శ్రద్ధ



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, కార్పొరేటర్ పోతురాజు సమత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, నిర్మూల గురించి రోగులకు, సహాయకులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేందుకు తనవంతు కృషి చేయాలన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుతామంటూ స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేయించారు.

దేవాలయాలను తొలగించ కుండా రోడ్డు విస్తరణ చేపట్టాలి

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ రోడ్డు విస్తరణలో దేవాలయాలను తొలగించకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని నెహ్రూనగర్ రోడ్ ఎక్స్‌టెన్షన్ బాధితులు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు శనివారం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రావుల మణి, నాగేశ్వరరావు, చెన్ను రవి, శ్రీనివాస్, సూరగాని శ్రీను, ఆళ్ల శ్రీను పాల్గొన్నారు.